
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 9 మార్చి 2024
5





	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	24
భద్రాద్రి కొత్తగూడెం	36	24


మధిర మృత్యుంజయస్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భట్టి దంపతులు


గుడిపాడు శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే రాగమయి


తీర్థాల క్షేత్రంలో భక్తుల రద్దీ


కూసుమంచి శివాలయంలో అభిషేకం

హరహర మహాదేవ

శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో శివయ్యను దర్శించుకున్నారు. శుక్రవారం తెల్లవారు జామునుంచే భక్తుల రాకతో కిటకిటలాడిన ఆలయాలు రాత్రి వరకు అదే రద్దీతో కనిపించాయి. పలు చోట్ల జాతరలు, తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల, వైరా మండలం స్నానాల లక్ష్మీపురం, కూసుమంచి, చింతకాని మండలం నేరడ, పెనుబల్లి మండలం నీలాద్రి, బోనకల్, కల్లూరు, కోటిలింగాల తదితర చోట్ల శివరాత్రి జాతర, తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులు, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు జరిపారు. నేరడ శివాలయం జాతర ఉత్సవాల్లో ప్రముఖ సినీహీరో ప్రభాస్ చెల్లెలు, దివంగత హీరో కృష్ణంరాజు కుమార్తె సాయి ప్రసీద పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

- ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం



- ఘనంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాలు
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల ప్రత్యేక పూజలు
- నేరడ శివాలయానికి వచ్చిన హీరో ప్రభాస్ చెల్లెలు ప్రసీద

7

సీఎం పర్యటనకు చకచకా ఏర్పాట్లు



- తొలుత భద్రాద్రి రామయ్య దర్శనం
- అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- మిథిలా స్టేడియంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- ఏర్పాట్లను సమీక్షించిన కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ రోహిత్

కొత్తగూడెం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 11న జిల్లాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన, ఇందిరమ్మ ఇళ్ల పథక ప్రారంభం తదితర అంశాలపై శుక్రవారం భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక అల ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, ఎస్పీ రోహిత్ రాజు, జిల్లా అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాలశాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇతర క్యాబినెట్ మంత్రులతో కలిసి భద్రాచలంలో పర్యటించనున్నారని తెలిపారు.

ఉదయం ముందుగా సీతారామచంద్రస్వామి వారిని దర్శించుకుని మిథిలా స్టేడియంలో ఏర్పాటుచేసిన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారని తెలిపారు. తదుపరి అక్కడే ఏర్పాటు చేసిన సభలో మూడు వేలమంది ప్రజల సమక్షంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారని, భోజనం అనంతరం మణుగూరులో ఏర్పాటు చేసిన భారీ బహిరంగసభలో పాల్గొంటారన్నారు.

ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్‌రాజుతో మాట్లాడుతూ హెలీప్యాడ్ ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లు, క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. హెలీప్యాడ్ వద్ద అంబులెన్స్, డాక్టర్లు, ఫైర్ ఇంజన్ తదితర అత్యవసర ఏర్పాట్లు చేయాలన్నారు. ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్‌తో మాట్లాడుతూ కల్యాణ మండపం వద్ద ఎలక్ట్రికల్, జనరేటర్, ఏసీల ఏర్పాటు, వాహనాల పార్కింగ్‌కు వసతి ఏర్పాట్లు పర్యవేక్షించాలన్నారు. ముఖ్యమంత్రి దైవదర్శనం, సమీక్ష సమావేశం, ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవానికి వచ్చే ప్రజలకు కూర్చునే ఏర్పాట్లు, తాగునీటి వసతి, భోజన ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆర్డీవోను ఆదేశించారు.

సీతమ్మసాగర్ ప్రాజెక్టుపై జరిగిన, జరగాల్సిన పనులపై పూర్తి నివేదిక సిద్ధం చేసుకోవాలని ఇరిగేషన్ ఈఈ శ్రీనివాస్‌రెడ్డిని ఆదేశించారు. బారికేడ్లు, హెలీప్యాడ్, కుర్చీల ఏర్పాట్లు, మణుగూరులో జరిగే బహిరంగసభ, ఏర్పాట్లను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లును ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధి పనులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ సిద్ధం చేసుకోవాలని దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రమాదేవిని ఆదేశించారు భద్రాద్రి డీఆర్‌వో రవీంద్రనాథ్‌ను అన్ని ఏర్పాట్లపై పర్యవేక్షించాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో డీఆర్‌వో రవీంద్రనాథ్, డీఆర్‌డీవో విద్యాచందన, జిల్లా పరిపాలన అధికారి గన్య, డీఎంహెచ్‌వో శిరీష, డీఎస్‌వో రుక్మిణి, భద్రాచలం ఆర్డీవో కే.దామోదర్‌రావు, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఆర్అండ్‌బీ ఈఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ శ్రీనివాసరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, ఇరిగేషన్ ఈఈ అర్జున్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మణుగూరులో బహిరంగ సభ!?

భద్రాచలం, మార్చి 8: వాస్తవానికి సీఎం భద్రాచలంలో రామయ్య దర్శనం అనంతరం ఈనెల 11న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అధికారికంగా బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలో ప్రారంభిస్తారని ప్రచారం సాగింది. అయితే పినపాక నియోజకవర్గంలోని మణుగూరు మండల కేంద్రంలో సీఎం బహిరంగ సభను నిర్వహించాలనే యోచనలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రతిపాదించడంతో అందుకు సానుకూలంగా స్పందించినట్లు వినికిడి. ఇప్పటివరకు అధికారికంగా ఎటువంటి షెడ్యూల్ ఖరారు కానప్పటికీ అధికార యంత్రాంగం మాత్రం ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి పెట్టింది.

మళ్లీ బరిలో బలరాం

- మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసిన కాంగ్రెస్ అధిష్ఠానం
- 2009 తర్వాత వరుస ఓటములు
- అయినా ఆయనకే దక్కిన అవకాశం
- ఖమ్మంపై కొనసాగుతున్న ఉత్కంఠ
- రేసులో పలువురు ఆశావహులు



ఖమ్మం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి):లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థుల ఎంపిక కాంగ్రెస్ అధిష్ఠానం కొలిక్కి తీసుకొచ్చింది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గానికి కేంద్ర మాజీ మంత్రి బలరాంనాయక్ పేరును ఖరారు చేసింది. అయితే ఖమ్మం లోక్‌సభ అభ్యర్థి ఎంపిక విషయం మాత్రం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఢిల్లీలో కాంగ్రెస్ జాతీయ ఎన్నికల కమిటీ శుక్రవారం సమావేశమైంది. తెలంగాణలో పలు నియోజకవర్గాలకు అభ్యర్థుల ఎంపిక కసరత్తు చేసింది. మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కేంద్ర మాజీమంత్రి బలరాంనాయక్‌తోపాటు వైరాకు చెందిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరురాలు విజయబాయి కూడా టికెట్ ఆశిస్తూ గట్టిగా ప్రయత్నాలు చేశారు. అధిష్ఠానం మాత్రం బలరాంనాయక్ వైపు మొగ్గు చూపింది. మహబూబాబాద్ టికెట్ కోసం బెల్లయ్యనాయక్‌తోపాటు పలువురు ప్రయత్నాలు చేశారు. 2009లో బలరాంనాయక్ మొదటిసారిగా ఎంపీగా పోటీచేసి కేంద్ర మంత్రి అయ్యారు. రాష్ట్ర విభజనలో బలరాంనాయక్ కూడా కీలక పాత్ర పోషించారు. ఆ తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి టీఆర్ఎస్ అభ్యర్థి సీతారాంనాయక్ చేతిలో ఓటమి చెందారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుత టీఆర్ఎస్ ఎంపీ మాలోతు కవిత చేతిలో ఓడిపోయారు. ఈనెల 11న మణుగూరులో రేవంత్‌రెడ్డి బహిరంగ సభలో బలరాంనాయక్ ఎన్నికల ప్రచార కార్యక్రమం కూడా ప్రారంభం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి 11న భద్రాచలం, పినపాక నియోజకవర్గాల్లో పర్యటించబోతున్నారు. భద్రాచలం సీతారామచంద్రస్వామి దర్శనం, జిల్లాల అభివృద్ధిపై సమీక్ష, రాష్ట్ర ప్రభుత్వం ఐదో గ్యారంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం నిర్వహించి సాయంత్రం మణుగూరులో జరిగే బహిరంగ సభలో పాల్గొనబోతున్నారు.

ఖమ్మంపై ఇంకా ఉత్కంఠ

ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గంపై ఇంకా ఉత్కంఠ సాగుతూనే ఉంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి నందిని టికెట్ ప్రయత్నంలో ఉండగా.. మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్, మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాదరెడ్డి కూడా టికెట్ ప్రయత్నాల్లో ఉన్నారు. వీరితోపాటు పీసీసీ నుంచి జిల్లా కాంగ్రెస్ నుంచి కూడా పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నాయి. సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పోటీచేస్తారని ప్రచారం జరిగినా.. సోనియా రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఇక రాహుల్‌గాంధీ కూడా కేరళలోని వాయనాడ్ నుంచే పోటీ చేస్తారని తెలుస్తుండటంతో... ప్రస్తుతం ఉన్న ముగ్గురు మంత్రుల కుటుంబీకులతోపాటు జట్టి కుసుమకుమార్‌తోపాటు జిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు తదితరుల పేర్లు కూడా పరిశీలన జరిగే అవకాశం ఉంది. వీరు కాకుండా రాష్ట్రస్థాయిలో గుర్తింపు కలిగిన మరొకరిని ఖమ్మం నుంచి ఎన్నికల బరిలోకి దింపే అవకాశం కూడా లేకపోలేదు.

ముంపు భయం ఎన్నాళ్లు!?

- ప్రతీ వర్షాకాలంలో భద్రాద్రిని వెన్నాడుతున్న వరద
- కరకట్టను పటిష్టపరిచి ఎత్తు పెంచాలంటున్న భద్రాద్రివాసులు
- 2022 జూలైలో మహోగ్ర గోదావరితో ఏజెన్సీ ఆగమాగం
- గత ప్రభుత్వంలో ఇచ్చిన హామీలన్నీ కాగితాలపైనే..
- 11న సీఎం రేవంత్‌రెడ్డి స్పందిస్తారని భిన్నవర్గాల ఆశలు



6

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలాన్ని పోలవరం బ్యాక్‌వాటర్ ముంపు నుంచి శాశ్వతంగా రక్షణ కల్పించడం అత్యంత ఆవశ్యంగా కనిపిస్తోంది. 2022 జూలై 17న గోదావరి మహోగ్ర రూపంతో భద్రాచలం, బూర్గంపాడుతోపాటు దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం తదితర మండలాలు అతలాకుతలమయ్యాయి. ముంపు ముప్పు పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రస్తుతం ఉన్న కరకట్టను పటిష్టపరిచి, ఎత్తు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని భద్రాద్రివాసులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. 2022లో అప్పటి సీఎం కేసీఆర్ భద్రాద్రికి శాశ్వత వరద రక్షణకోసం కరకట్టలను పటిష్టం చేసి ఎత్తు పెంచి చివరి వరకు పొడిగిస్తామని మాట ఇచ్చారు. ఈ క్రమంలో రూ.1000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అయితే సాంకేతిక కారణాలతో అది ముందుకు సాగలేదు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో భద్రాద్రికి ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించేందుకు చర్యలు చేపడతారని ఆశిస్తున్నారు. ఈ నెల 11న భద్రాద్రికి వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఈ సమస్యపై స్పందించాలని భద్రాద్రి వాసులు కోరుతున్నారు.

-భద్రాచలం

'కమలం'వైపు జలగం చూపు!



- బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం
- ఖమ్మం ఎంపీ అభ్యర్థిగా ఖరారయ్యే అవకాశం

ఖమ్మం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడు, మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావు బీజేపీలో చేరి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎన్నికల బరిలోకి దిగనున్నట్లు తెలిసింది. మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో ఈ మేరకు వెంకట్రావు చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ నెల 11 లేదా 12 తేదీల్లో వెంకట్రావు బీజేపీలో చేరిక, ఖమ్మం అభ్యర్థిగా ఖరారయ్యే అవకాశం ఉంది. 2004లో సత్తుపల్లినుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన వెంకట్రావు నియోజకవర్గాల పునర్విభజన అనంతరం ఖమ్మం అసెంబ్లీ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి 2009లో ఓటమి చెందారు. 2014లో టీఆర్ఎస్‌లో చేరి కొత్తగూడెం ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలుపొందారు. 2018లో టీఆర్ఎస్ నుంచి పోటీచేసి ఓటమి పొందారు. అప్పుడు గెలుపొందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు టీఆర్ఎస్‌లో చేరటంతో గత అసెంబ్లీ ఎన్నికల్లో వెంకట్రావుకు బీఆర్ఎస్ టిక్కెట్ దక్కలేదు. దీంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి కొత్తగూడెంలో రెండోస్థానంలో నిలిచారు. మూడు నెలలుగా స్తబ్దతగా ఉన్న వెంకట్రావు లోక్‌సభ ఎన్నికల నేపథ్యాన్ని పురస్కరించుకొని కమలం గూటికి చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. బీజేపీ ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా వెంకట్రావు పేరును ఖరారు చేసే అవకాశం ఉన్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి. వెంకట్రావు బీజేపీలో చేరటంద్వారా ఉమ్మడి జిల్లాలో పార్టీ బలపడుతుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.

'గృహజ్యోతి' అర్హులకు ఊరట

- 'ప్రజాపాలన'లో సమర్పించిన దరఖాస్తుల్లో తప్పుల సవరణ
- రెండో విడత జీరో బిల్లుల పంపిణీ ప్రారంభించిన సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, మార్చి 8: అర్హత ఉండి ఉచిత విద్యుత్ జీరో బిల్లులు కనిపించని వారికి కొంత మేర ఊరట కలుగుతోంది. లబ్ధిదారులు ప్రజాపాలనలో ఉచిత విద్యుత్‌పై దరఖాస్తుల సమయంలో ఆధార్, విద్యుత్ మీటరు నెంబర్లు తప్పుగా నమోదు చేయటంతో 10శాతం మంది వరకు అర్హత ఉండి కూడా జీరో బిల్లులు రాలేదు. దీంతో ఖమ్మం మునిసిపల్ కార్యాలయం, జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో మరోసారి ప్రజాపాలన దరఖాస్తులు చేశారు. సరైన ఆధార్ నెంబర్, విద్యుత్ మీటరు నెంబర్లను అందించారు. దీంతో టీఎస్ ఎన్పీడీసీఎల్ సంస్థ రెండో విడతగా జీరో బిల్లులను విడుదల చేసింది. ఇలా నూతనంగా జీరో బిల్లులు అర్హత సాధించిన లబ్ధిదారుల సెల్‌ఫోన్లకు అర్హతా సమాచారం లింక్ అందుతోంది. లింక్‌ను క్లిక్ చేసిన వెంటనే వారి సెల్‌ఫోన్‌లోనే జీరో బిల్లు కూడా కనిపిస్తోంది. ప్రజాపాలనలో తప్పులు సవరణ తర్వాత వచ్చిన జీరో బిల్లులను రెండో విడతగా ఖమ్మం టీఎస్ ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సురేందర్ శుక్రవారం పంపిణీ చేశారు.

అక్కకు ఆస్తి ఇవ్వడం లేదని...


హత్యకు గురైన మల్లయ్య

- మామను కడతేర్చిన యువకుడు
- కొట్టి చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీరించేందుకు యత్నం
- సహకరించిన మరో యువకుడు
- పాల్వంచ మండలం ఉల్వనూరు బంజరలో దారుణం

6

రుణం పేరుతో మోసం



- ధని ఫైనాన్స్ పేరుతో వాట్సప్‌లో చాటింగ్
- ప్రాసెసింగ్ ఫీజు పేరుతో రూ.9వేలు కాజేసిన కేటుగాళ్లు
- సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదుచేసిన పండితాపురం మహిళ

6

ఘనంగా మహిళా దినోత్సవం

- జిల్లావ్యాప్తంగా వేడుకల్లో పాల్గొన్న పలువురు ప్రముఖులు

8

టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడి బదిలీ నిలిపివేత

ఖమ్మం కలెక్టరేట్, మార్చి 8: టీఎన్జీవో సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హసన్ బదిలీని రద్దు చేస్తూ, ఆయనను పూర్వస్థానంలోనే కొనసాగించాలని హైకోర్టు శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సర్వే ల్యాండ్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న హసన్‌ను ఓ వ్యక్తి ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం ములుగుకు బదిలీ చేస్తూ ఈ నెల 5న ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. చిరునామానే లేని వ్యక్తి ఆరోపణల ఆధారంగా కనీసం ప్రాథమిక విచారణ జరపకుండా బదిలీ చేయడం అన్యాయమని, ఆయన తన పిటీషన్‌లో పేర్కొన్నారు. ఈ క్రమంలో విచారణ జరిపిన హైకోర్టు ఆయన బదిలీని రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణకు రేపు అర్హత పరీక్ష

●ఆన్‌లైన్‌లో హాల్ టికెట్లు ●డీడీ కస్తాల సత్యనారాయణ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 8: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎస్సీ నిరుద్యోగులు పోటీ పరీక్షల ఉచిత శిక్షణ కోసం సాంఘీక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఎంపిక కోసం అర్హతా పరీక్షను ఆదివారం ఖమ్మంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ(ఎస్ఆర్ బీజీఎన్ఆర్)లో ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 5నెలల కోర్సు కోసం 100 మంది అభ్యర్థులకు అవకాశం ఉండగా మొత్తం 540 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేశారని తెలిపారు. పరీక్షల కోసం ఆన్‌లైన్‌లో హాల్ టికెట్‌లు అందుబాటులో ఉన్నాయని, టీఎస్ స్టడిసర్కిల్.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. పరీక్షలు రాసే అభ్యర్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరన్నారు. బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే పరీక్షా కేంద్రానికి రావాలని పూర్తి వివరాలకు 9848494290 నెంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

ఎన్ఎండీసీ కర్మాగారం అభివృద్ధికి కృషి

● కర్మాగారాన్ని సందర్శించిన సీజీఎం జైన్



ఎన్ఎండీసీ ప్రాజెక్టు సీజీహెచ్ జైన్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

పాల్వంచ టౌన్, మార్చి 8: పాల్వంచలోని ఎన్ఎండీసీ కర్మాగారాన్ని ప్రాజెక్టు చీఫ్ జనరల్ మేనేజరు ఎస్‌కే. జైన్ శుక్రవారం సందర్శించారు. ప్లాంట్ ప్రస్తుత పరిస్థితిని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కర్మాగారం అంతా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కర్మాగారం పురోభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దానికి కార్మికుల సహకారం ఉండాలన్నారు. అనంతరం ఆయనను కార్మికసంఘ నాయకులు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం మెకానికల్ యూనిట్ ఇంచార్జీ నాగరాజు నాయుడు, కార్మికసంఘ నాయకులు బాణోత్ బాలునాయక్, ఎస్. కోటేశ్వరరావు, రంగయ్య, వై. సాంబశివరావు, ఉపేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయల బోస్, నాగేశ్వరరావు వర్ధంతి సభ

తిరుమలాయపాలెం, మార్చి 8: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్, సీపీఐ ఎంఎల్ ఎన్డీ జిల్లా నాయకులు రాయల నాగేశ్వరరావు వర్ధంతి సభ శనివారం పిండిప్రోలులో జరుగుతుందని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లానాయకులు గుర్రం అచ్చయ్య, తెలంగాణ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పుసులూరి నరేందర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పిండిప్రోలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయల బోస్ 45 ఏళ్లపాటు ప్రజలు, ఆదీవాసీల హక్కుల కోసం అలు పెరగని పోరాటలు చేశారని, తెలిపారు. కార్యక్రమంలో బందెల వెంకయ్య, కమ్మకోమటి నాగేశ్వర రావు, తిమ్మిడి హనుమంతరావు, పుసులూరి పుల్లయ్య, వెంకటస్వామి, విజయ్, చిరంజీవి, సరోజన, నవీన్ పాల్గొన్నారు.

రేపు ఖమ్మంలో ‘లావా’ పుస్తక ఆవిష్కరణ

● హాజరు కానున్న కోదండరాం, దేశపతి శ్రీనివాస్

ఖమ్మం సాంస్కృతికం మార్చి 8: ప్రముఖ కవి యనగంధుల దేవయ్య రచించిన ‘లావా’ కవిత్వ పుస్తక ఆవిష్కరణ సభ ఆదివారం ఖమ్మంలోని ఐఎంఏ హాలులో ఉదయం 10:30కి జరుగనుంది. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో కోదండరాం, దేశపతి శ్రీనివాస్, పోటు రంగారావు, ఆనందాచారి, యాకూబ్ తదితరులు హాజరుకానున్నారు.

ఆర్టీసీ బస్‌పై ఆకతాయి దాడి

»బస్ అద్దాలు ధ్వంసం » డ్రైవర్, కండక్టర్‌పై దాడి »పోలీసులకు ఫిర్యాదు



ధ్వంసమైన బస్సు అద్దాలు

కామేపల్లి, మార్చి 8: రోడ్డుకు అడ్డంగా ఆటో ఆగిఉం డడంతో బస్సు డ్రైవర్ హారన్ కొట్టడంతో ఆటో డ్రైవర్ బస్సుపై, డ్రైవర్‌పై, కండక్టర్‌పై దాడి చేసి బస్సు అద్దాలు పగలగోట్టిన సంఘటన కామేపల్లి మండలం గోవింద్రాలలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఖమ్మం డిపో బస్సు ప్రయాణికులతో గార్ల నుంచి ఖమ్మం వెళ్తుంది. గోవింద్రాల గ్రామంలోకి వచ్చేసరికి రోడ్డుపై ఓ ఆటో అడ్డుగా ఉండడంతో బస్ డ్రైవర్ శ్రీను హారన్ కొట్టాడు. హారన్ కొడతవా అని గోవింద్రాలకు చెందిన అజ్మీర చిరంజీవి అలియాస్ నరేష్ ఆర్టీసీ డ్రైవర్ శ్రీనుపై దాడి చేశాడు. అనంతరం కండక్టర్ గట్ల సీతరాములుపై కూడా దాడి చేశాడు. బస్సు అద్దాలను రాళ్లతో పగలగొట్టాడు. బస్సును పూర్తిగా రాళ్ల ధ్వంసం చేశాడు. అంతేకాకుండా కండక్టర్ వద్ద ఉన్న క్యాస్ బ్యాగ్‌ను లాకున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకోగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. వారిపై దాడి చేసే ప్రయత్నం చేశాడు. ఈ దాడిలో డ్రైవర్ శ్రీనుకు చేతికి గాయలు అయ్యాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాధం జరగ లేదు. కండక్టర్ గట్ల సీతరాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

అరెస్టు చేసి జైలుకు తరలింపు

బస్సుపై దాడి చేసిన చిరంజీవి అలియాస్ నరేష్‌పై కేసు నమోదు అయింది. అరెస్టు చేసి వైద్య పరీక్షలు నిర్వహించి ఖమ్మం సబ్ జైలుకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాల్వంచ, మార్చి 8: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలపాలై మరుసటి రోజు మృతి చెందిన సంఘటనపై పాల్వంచ టౌన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం మునిసిపాలిటీ పరిధిలోని పేటచెరువు కొత్తూరుకు చెందిన పూనెం ప్రకాష్(27) స్థానికంగా కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి ద్విచక్రవాహనంపై పాల్వంచకు ప్రయాణమయ్యాడు. దారిలో అదుపుతప్పి చెట్టుకు ఢీ కొట్టడంతో అతని చాతీకి బలమైన గాయమైంది. బయటకు కనిపించని గాయాలేమీ లేక పోవడంతో అతను కూడా ఆస్పత్రికి వెళ్లలేదు. మరుసటి రోజు ఉదయం (శుక్రవారం) తన భార్య సుజాత ఇచ్చిన పాలు తాగి వాంతి చేసుకోవడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పాల్వంచలోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు విచారణ చేసి సెల్ఫ్ యాక్సిడెంట్‌గా పోలీసులు కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి గాయాలు

కామేపల్లి, మార్చి 8: గుంతల రోడ్డులో ద్విచక్రవాహనం పల్టీ కొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్రగాయలు అయిన సంఘటన కామేపల్లి మండలం మద్దులపల్లి గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. 108 సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ జిల్లా వేముల గ్రామానికి చెందిన శేఖర్ గొర్రెల కాపాలకు మద్దులపల్లి వచ్చాడు. ముచ్చర్లకు వెళ్తున్న క్రమంలో రోడ్డు అస్తవ్యస్తంగా ఉండి పూర్తిగా గుటల మయం కావడంతో బైక్ అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఈఘటనలో వ్యక్తి తీవ్రగాయలు అయ్యాయి. అక్కడే ఉన్న బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు జాల శ్రీను యాదవ్, మరికొందరు గ్రామస్థులు 108 కాల్ చేయడంతో ఆ వ్యక్తిని 108 ఖమ్మం ప్రభ్తుం ఆసుపత్రికి తరలించారు.

భద్రాద్రికి ముంపు భయం ఎన్నాళ్లు?

» కరకట్టను పటిష్టపరిచి ఎత్తుపెంచాలంటున్న భద్రాద్రివాసులు

» 2022లో వచ్చిన మహోగ్ర గోదావరితో ఏజెన్సీ ఆగమాగం

» తాజాగా 700 మీటర్ల మిగులు కరకట్ట పనులకే పరిమితం

భద్రాచలం, మార్చి 8: పోలవరం బ్యాక్ వాటర్ ముంపు నుంచి ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన భద్రాచలంకు శాశ్వతంగా వరద ముంపు నుంచి రక్షణ కల్పించాలనే ప్రధాన డిమాండ్ భద్రాద్రివాసుల నుంచి వ్యక్తమవుతోంది. ఎందుకంటే 2022 జూలై 17న గోదావరి మహా ఉగ్రరూపంతో భద్రాచలం, బూర్గంపాడుతో పాటు దుమ్ముగూడెం, చర్ల, అశ్వాపురం తదితర మండలాలు అతలాకుతలమయ్యాయి. గత మూడు దశాబ్దాల్లో ఎన్నడూ లేని విధంగా గోదావరి మహా ఉగ్రరూపం దాల్చడంతో భద్రాద్రి ఏజెన్సీలో రాకపోకలు స్తంభించడమే కాదు ఏ క్షణాన ఏం జరుగుతుందో తెలియని ఆందోళన పరిస్థితి నెలకొంది.

ఇటువంటి పరిస్థితులు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ఉండాలంటే ప్రస్తుతం ఉన్న కరకట్టను పటిష్టపరిచి ఎత్తు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని భద్రాద్రివాసులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. ప్రస్తుతం గోదావరి ముంపు నుంచి శివారు కాలనీవాసులను రక్షించేందుకు భద్రాచలం సుభాష్‌నగర్ కాలనీ వద్ద నుంచి చేపట్టాల్సిన మిగులు కరకట్ట నిర్మాణ పనులకు మోక్షం లభించింది. రూ.38.045 కోట్ల అంచనా విలువలతో ఈ పనులను చేపడుతున్నారు. సుమారు 700 మీటర్ల కరకట్ట నిర్మాణం పనులు జూన్ నాటికి పూర్తి చేయాలని అధికారులు కసరత్తు చేపట్టారు.



పూర్తిస్థాయి నిర్మాణంతోనే శాశ్వత రక్షణ

భద్రాద్రికి భవిష్యత్తులో వచ్చే వరదలతో ముంపు లేకుండా శాశ్వత రక్షణ కావాలంటే పూర్తిస్థాయి కరకట్టల నిర్మాణమే పరిష్కారమని భద్రాద్రివాసులు ముక్తకంఠంతో పేర్కొంటున్నారు. 2022 జూలైలో వచ్చిన గోదావరి నది వరదలతో పరివాహక ప్రాంతంలోని మండలాలు అతలాకుతలం కాగా భద్రాచలం, బూర్గంపాడు మండలాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ క్రమంలో ఆనాడు అప్పటి సీఎం కేసీఆర్ భద్రాద్రికి శాశ్వత వరద రక్షణ కోసం కరకట్టలను పటిష్టవంతం చేసి ఎత్తు పెంచి చివరి వరకు పొడిగిస్తామని మాట ఇచ్చారు. ఈ క్రమంలో రూ.1000 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం క్యాబినేట్ ఆమోదం తెలుగా ఈ పనులను సత్వరమే చేపడతారని ముంపు వాసులకు డబుల్‌బెడ్‌రూం ఇళ్లు నిర్మిస్తారని అందరూ భావించారు.

ఈ క్రమంలో అందరి ఆశలను ఆవిరి చేస్తూ గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో కరకట్టల నిర్మాణం అసాధ్యమని ఈఎన్‌సీ కమిటీ పేర్కొనడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ప్రభుత్వ తీరుపై సైతం భద్రాద్రివాసులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో నాటి ప్రభుత్వం మరింత అధ్యయనంకు సాంకేతిక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చే సింది. ఈ క్రమంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎన్నికల సమయంలో ఆ పార్టీ నాయకులు సైతం భద్రాద్రికి ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చర్యలు చేపడతామని ప్రకటించడంతో మరోసారి భద్రాద్రివాసులు ప్రభుత్వ నిర్ణయంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాకు చెందిన ముగ్గురు కీలక మంత్రులు మంత్రివర్గంలో ఉండటంతో భద్రాచల పుణ్యక్షేత్రానికి ముంపు నుంచి శాశ్వత రక్షణ కల్పించేందుకు త్వరలోనే ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఏదిఏమైనప్పటికీ కరకట్టలు పూర్తిస్థాయిలో నిర్మాణం చేసిన నాడే ఎగువన నిర్మించే పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్, గోదావరి వరదల నుంచి భద్రాచలం, బూర్గంపాడువాసులకు రక్షణ ఉంటుందని ఈ ప్రాంతవాసులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం కోసం వారు ఆశగా ఎదురు చూస్తున్నారు.



కాలం చెల్లిన ప్యాకేజీలు

గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ప్రతి ఏటా వచ్చే వరదల నుంచి పరివాహక ప్రాంతవాసులను రక్షించేందుకు గతంలో రూపొందించిన వరద కరకట్ట నిర్మాణ పనులకు సంబందించిన ప్యాకేజీలకు కాలం చెల్లింది. 17 ఏళ్ల క్రితం ఇందుకు సంబంధించిన పనులకు మూడు ప్యాకేజీలతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆమోదం తెలిపి నిధులను విడుదల చేసింది. అనంతరం ఒక ప్యాకేజీలోని పనులు కొద్దిపాటిగా సాగగా మిగిలిన రెండు ప్యాకేజీలకు సంబంధించిన పనుల విషయమై భూ సేకరణ సమస్య తలెత్తడంతో ఇందుకు సంబంధించిన పనులు ముందుకు సాగలేదు.

ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించడంతో కరకట్ట నిర్మాణ పనుల ఊసే లేకుండా పోయింది. మంజూరైన నిధులను సకాలంలో వినియోగించకపోవడంతో అవి వెనక్కి వెళ్లాయని తెలుస్తోంది. 2006లో గోదావరి ఉగ్రరూపంను చూసిన అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం 2007 ఫిబ్రవరి 28న మూడు ప్యాకేజీలతో కరకట్ట పనులను నిర్వహించేందుకు జీవోఎంఎస్ నెం.47/ఐఅండ్‌సీఏడీని జారీ చేసింది. ఇందుకు గాను రూ.172.84 కోట్లు విడుదలు చేసి టెండర్లు పిలిచినా భూ సేకరణతో సమస్యతో పాటు వివిధ కారణాలతో కొన్ని పనులు ముందుకు సాగలేదు. కాగా మరికొన్ని పనులు ప్రారంభానికే నోచుకోలేదు.

నిబంధనలకు విరుద్ధంగా ఇసుక రవాణా

» అడుగంటుతున్న భూగర్భ జలాలు »అక్రమ రవాణాలో ఓ ప్రజాప్రతినిధి భర్త హస్తం ఉన్నట్టు ఆరోపణ





మధిర మండలం ఖమ్మంపాడు-మహదేవపురం సరిహద్దు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

మధిరరూరల్, మార్చి 8: మధిర మండలం మహదేవపురం, ఇల్లెందులపాడు, ఖమ్మంపాడు గ్రామాల సమీపంలోని వైరా ఏటి నుంచి నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ముఖ్యంగా మహదేవపురం, ఇల్లెందులపాడు రెవెన్యూలోని ఏట్లో కొన్నిరోజుల నుంచి ఇష్టరాజ్యంగా ఇసుకను బయటకు తరలించి అక్రమార్కులు కాసులు దండుకుంటున్నారు. ఒక కూపన్ తీసుకొని మూడు నుంచి ఆరు ట్రాక్టర్లతో ఇసుకను మధిర మండలం నుంచి బయట ప్రాంతాలకు తరలిస్తున్నారనే ఆరోపణలు విన్పిస్తున్నాయి. అంతేకాక రాత్రుల సమయాల్లో గుట్టుచప్పుడుగా ఇసుకను తరలిస్తున్నారు. మధిర మండ లం పక్కనే ఉన్న ఆంధ్రా గ్రామాలైన జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, శివాపురం గ్రామాలకు ఇక్కడి నుంచే ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. భూగర్భజలాలు అడుగంటి తాగునీటి సమస్య తీవ్రమైన ఈ సమయంలో ఇసుక తవ్వకాల వల్ల కూడా మరింత సమస్య వచ్చే ప్రమాదముందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా రు. వైరా నది ఏటిలో సాగు, తాగునీటి పథకాలున్నాయి. ఇసుక తరలింపుతో ఈ పథకాల పరిస్థితి అంతంత మాత్రమంగానే తయారయ్యాయి. ఓ ప్రజాప్రతి నిధి భర్త పలువురు నాయ కులు కలిసి టీంగా ఏర్పడి ఇ సుక దందా జోరుగా సాగిస్తున్నట్లు స్థానిక ప్రజల నుం చి ఆరోపణలు విన్పిస్తున్నాయి. అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

‘తెలంగాణ మాదిగ హక్కుల దండోరా’

రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్ మాదిగ



మాట్లాడుతున్న కొరిపల్లి శ్రీనివాస్

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి 8: ‘తెలంగాణ మాదిగ హక్కుల దండోరా’ రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మానికి చెందిన కొరిపల్లి శ్రీనివాస్ మాదిగ నియమతులయ్యారు. ఈమేరకు ఆసంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను కనకరాజు మాదిగ, జాతీయ అధ్యక్షుడు వేముల బలరాం మాదిగలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణకు పార్లమెంట్ లో చట్టబద్దత కలిపించడానికి కాంగ్రెస్ పార్టీ తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం దళితులకు రూ.12లక్షలను డాక్టర్ బీఆర్ అంబే ద్కర్ అభయహస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి అందించాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు రెండు పార్లమెంట్ స్థానాలు కల్పించాలని తెలిపారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం మాదిగ, మాదిగ ఉపకులాలకు నాలుగు మంత్రి పదవులు కేటాయించాలన్నారు. మాదిగ జనాభా నిష్పత్తి ప్రకారం నామినేటెడ్ పదవులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ శ్యామల మాదిగ, పడిశాల వెంకన్న మాదిగ, సక్కుర్తి కోటేశ్వరరావు, కనకపుడి వీరస్వామి , కొండపల్లి మధు తదిత రులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి అక్రమ తోలకాలు

●మట్టి, ఇసుక తరలిస్తున్న 8 ట్రాక్టర్ల పట్టివేత

జూలూరుపాడు, మార్చి 8: మండలంలో అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను పోలీసులు శుకువారం తెల్లవారుజామున జూలూరుపాడు, బేతాళపాడు గ్రామాలలో పట్టుకున్నారు. వివరాలలో వెళితే జూలూరుపాడు గ్రామానికి చెందిన ఓ ఎక్సకవేటర్ యాజమాని జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా గురువారం అర్ధరాత్రి నుంచి మట్టి అక్రమ తవ్వకాలు జరుపుతూ ట్రాక్టర్లలో తరలిస్తూ విక్రయాలు సాగిస్తున్నారు. అదేవిధంగా బేతాళపాడు గ్రామంలోని పెద్దవాగు నుంచి ఓ వ్యక్తి ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న జూలూకుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో కలసి దాడులను నిర్వహించి అక్రమ తోలకాలను అడ్డుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ సిబ్బందిస్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ తిరపతిరావు, హెడ్ కానిస్టేబుల్స్ దయానంద్, మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరాలపై పోలీసుల దాడులు

అశ్వారావుపేట రూరల్, మార్చి 8: మండలంలోని నారంవారిగూడెం సమీపంలోని కొత్తూరు గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరాలపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడులు జరిపారు. కోడిపందాలు నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు ఎస్ఐ శ్రీరాముల శ్రీను ఆధ్వర్యంలో దాడులు జరిపారు. దాడుల్లో రూ.9800 నగదు, రెండు ద్విచక్ర వాహనాలు, 3 చరవాణీలు, 10 కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో వైద్య శిబిరం

» ‘జ్వరంతో మంచం పట్టిన కిష్టారం’ వార్తకు కదిలిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సత్తుపల్లిరూరల్, మార్చి 8:‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన ‘జ్వరంతో మంచంపట్టిన కిష్టారం’ అనే కథనానికి శుక్రవారం అధికారులు స్పందించా రు. హుటాహుటీనా గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించి రోగులను పరీక్షించి వైద్యం అందిస్తున్నారు. గంగారం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం, సింగరేణి హెల్త్ సబ్ సెంటర్ వేర్వేరుగా ఉచిత వైద్య శిభిరం నిర్వహిం చారు. గురు, శుక్రవారాలలో సుమారు 200మందిని పరీక్షించగా 15మంది ని జ్వర పీడితులుగా గుర్తించామని, ఎక్కువమంది కీళ్ల, ఒళ్లునొప్పులతో బాధపడుతున్నట్లు గంగారం వైద్యాధికారి ఏ.అవినాష్ తెలిపారు. డెంగ్యూ, మలేరియా కేసులు లేవని, వైరల్ ఫీవర్స్ వస్తుండగా కాచి వడపోసిన నీటినే తీసుకోవాలని ప్రజలను కోరారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సైలోబంకర్, తాగునీటి, బాంబ్‌బ్లాస్టింగులే కారణమా ?

బాంబ్ బ్లాస్టింగుల కారణంగా తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉండటతంతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు శాంపిళ్లు సేకరించారు. సైలో బంకర్ వద్ద బొగ్గు రేణువులు లేవకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నట్లు సింగరేణి అధికారులు చెబుతున్నారు. గ్రామంలో పారిశుధ్య నివారణ చర్యలలో భాగంగా డ్రైనేజీలను ఏర్పాటు చేసి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని సింగరేణి సంస్థ తెలపగా గ్రామస్థులు శాశ్వత పరిష్కారం కావాలని కోరినట్లు సమాచారం.

అక్కకు ఆస్తి ఇవ్వడం లేదని..

» మామను కడతేర్చిన యువకుడు

పాల్వంచ, మార్చి 8: వితంతువు అయిన తన సోదరికి న్యాయంగా అత్తవారింటి నుంచి రావలసిన ఆస్తి రాలేదు.. ఈ మేరకు ఎన్నోసార్లు మామగారిని తన అక్కకు ఇవ్వాల్సిన ఆస్తిని ఇవ్వాలని అడిగాడు.. అయినా ఫలితం కనిపించలేదు. దీంతో విసిగి వేసారి కోపం పెంచుకున్నాడు. ఎలాగైనా మామను కడతేర్చాలని పథకం చేశాడు. స్నేహితుడి సాయంతో మామను మద్యం సేవించడానికి ఆహ్వానించి, నమ్మించి మద్యం మత్తులో ఉండగా కర్రతో తలపై మోది హత్య చేశాడు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలో శుక్రవారం వెలుగు చూసింది.

పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. పాల్వంచ మండలం ఉల్వనూరు బంజరకు చెందిన జోగా రాము అక్కకు అదే గ్రామానికి చెందిన కల్తీ మల్లయ్య(47) కుమారుడి కృష్ణతో తొమ్మిదేళ్ల ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లల సంతానం ఉన్నారు. అయితే నాలుగేళ్ల క్రితం కృష్ణ కొవిడ్‌తో చనిపోయాడు. అప్పటి నుంచి చట్ట ప్రకారం తన అక్కకు రావలసిన ఆస్తిని ఇవ్వాలని రాము పలుమార్లు మామ మల్లయ్యను కోరుతూ వస్తున్నాడు. అందుకు మల్లయ్య ససేమిరా అనడంతో రాము కోపం పెంచుకున్నాడు. ఈ క్రమంలో తన మిత్రుడు పూనెం శివకు సైతం మల్లయ్యపై కక్ష ఉందని తెలుసుకుని అతడి సాయంతో మల్లయ్యను హత్య చేయడానికి పథకం వేశాడు. గురువారం రాత్రి శివ సాయంతో మల్లయ్యను మద్యం సేవించడానికి ఆహ్వానించాడు. ముగ్గురూ కలిసి గ్రామశివారులోని శ్మశాన వాటికలో మద్యం సేవించారు. మల్లయ్య మద్యం మత్తులో ఉండగా రాము అతని మెడపై దుడ్డుకర్రతో మోదాడు. దీంతో మల్లయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. అనంతరం మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని రోడ్డుపైకి తీసుకువెళ్లి అక్కడ పడేసి, రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి ప్రచారం చేశారు. అయితే గ్రామస్తులు అనుమానం వచ్చి ప్రశ్నించడంతో అసలు విషయం బయట పడింది. దీంతో వారు నిందితులను పోలీసులకు అప్పగించారు. మృతుడి భార్య కొట్టెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వినయ్‌కుమార్ తెలిపారు. కాగా నిందితుల్లో ఒకడైన శివ తరపు బంధువులు ముగ్గురు గతంలో వివిధ కారణాలతో మృతి చెందారు. వారందరి మృతికి కారణం మల్లయ్య చేతబడే నని శివ భావించి కోపం పెంచుకున్నాడు. అందుకే మల్లయ్యను హత్య చేయడానికి రాముకు సహకరించినట్లుగా విశ్వసనీయ సమాచారం.

వరాల వన దేవతలకు.. మనసార మొక్కులు..

» పగిడిద్దరాజు జాతరకు పోటెత్తిన భక్తులు

» నేడు దేవతల వన ప్రవేశం

గుండాల, మార్చి 8; గద్దెనెక్కిన ఇంటి ఇలవేల్పులను దర్శించి తరించేందుకు పగిడిద్దరాజు జాతరకు మూడో రోజు భక్తులు పోటెత్తారు. జాతర పరిసరాలు జనసంద్రంగా మారాయి.. వనదేవతల ఆశీస్సులు అందుకునేందకు మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం సమ్మక్క భర్త అరెం వంశీయుడు పగిడిద్దరాజు జాతర గుండాల మండలం వేపలగడ్డలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం బర్లగుట్ట నుండి పగడిద్దరాజును ముక్కు పుడక రూపంలో తీసుకువచ్చిన తలపతులు గురువారం కుంకుమ భరిణ రూపంలోని సమ్మక్క తల్లి మాడిమోరి గుట్ట నుంచి గద్దెలపైకి చేర్చారు. వనం జనంలోకి అడుగిడిగా గద్దెలపైకి చేరిన దేవతలతో నిండు జాతర ఆరంభమైంది. శుక్రవారం భక్తులతో జాతర కళకళలాడింది. ఆదివాసీ సంప్రదాయాలతో పూజలు నిర్వహించారు. శనివారం దేవతలు వన ప్రవేశం చేయనుండటంతో భక్తులు దర్శనానికి పోటీపడ్డారు. శివసత్తుల పూనకాలతో జయజయ ధ్వానాలతో ప్రాంగణం మార్మోగిపోయింది. సాంప్రదాయ నృత్యాలతో డప్పువాయి ద్యాలతో సందడి చేశారు. పూజారులు, వడ్డెలు, తలపతులు అప్పయ్య, నాగ య్య, భిక్షం, బుచ్చయ్యలు దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో

రెండేళ్ల బాలుడి మృతి

బోనకల్, మార్చి 8: విద్యుదాఘాతంతో రెండేళ్ల బాలుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం ఖమ్మం జిల్లా బోనకల్ మండలం తూటికుంట్ల గ్రామంలో పండగపూట విషాదం నింపింది. గ్రామానికి చెందిన తగరపు రమేష్ ఎలక్ట్రికల్ హెల్పర్‌గా జీవనం సాగిస్తున్నాడు. అతనికి ఒక కుమారుడు నికోలస్(2) ఉన్నాడు. రమేష్ భార్య, తల్లి ఇద్దరూ టైలరింగ్ చేస్తుంటారు. ఇంట్లో ఎలక్ట్రికల్ టైలరింగ్ మిషన్ ద్వారా దుస్తులు కుడుతుంటారు. టైలరింగ్ మిషన్ వైపునకు వచ్చిన బాలుడు ఆ యంత్రానికి ఉన్న విద్యుత్ వైరును నోట్లో పెట్టుకున్న క్రమంలో విద్యుత్ ప్రసరణ జరిగి స్పృహ కోల్పోయాడు. పడి ఉన్న బాలుడిని చూసిన తల్లి కేకలు వేయడంతో అందరూ అక్కడకు వచ్చారు. విద్యుత్ షాక్‌కు గురి కావడాన్ని గమనించి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. ముద్దులొలికే చిన్నారికి అంతలోనే విధి వక్రీకరించి తమ నుంచి దూరమయ్యావా అని తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు అందరిచే కంట తడి పెట్టించింది.

రుణం మంజూరు పేరుతో మోసం

» రూ.5లక్షలు లోన్ మంజూరైందటూ ఫోన్

» మహిళ నుంచి రూ.9వేలు కాజేసిన కేటుగాళ్లు

» ‘ధని’ ఫైనాన్స్ పేరుతో సోషల్‌మీడియాలో చాటింగ్

» మోసపోయానని గ్రహించి సైబర్‌క్రైంకు ఫిర్యాదు

కామేపల్లి, మార్చి 8: రూ.5లక్షల రుణం మంజూరు పేరుతో ఓ మహిళ వద్ద సైబర్ కేటుగాళ్లు రూ.9వేలు కాజేసిన ఘటన కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పండితాపురం గ్రామానికి చెందిన అర్వపల్లి రమ ఫోన్‌కు ధని ఫైనాన్స్ నుంచి కాల్ చేస్తున్నాం మీకు లోన్ ఏమైన కావాలా అని ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. కావాలి అని అనడంతో వ్యక్తి ఎంత కావాలని అడిగితే రూ.5లక్షల కావాలని ఆ మహిళ తెలిపింది. దీంతో ఆ కేటుగాడు నీ ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు పంపమని అనడంతో సదరు మహిళ భర్తకు చెప్పి సోషల్‌మీడియాలో జిరాక్స్‌లు పంపింది. కొద్దిసేపటికి వాట్సప్‌లో మీకు లోన్ రూ.5లక్షలు మంజూరు అ యిందని వడ్డి 4శాతంతో 5సంవత్సరాలలో చెల్లించాలని చెప్పి ఆ వివరాలను ధని ఫైనాన్స్‌తో ఓ డాక్యుమెంట్ రూపంలో సోషల్‌మీడియాలో పంపించాడు. ఆ వ్యక్తి మరల ఫోన్ చేసి రూ.5లక్షలు లోన్ మంజూరైదని ప్రాసెసింగ్ ఫీజు రూ.1250 చెల్లించాలని ఓ క్యూఆర్ కోడ్ పంపాడు. నమ్మిన మహిళ ఫోన్‌పే ద్వారారూ.1250 పం పింది. అనంతరం ఏదో ఒక ఫీజు పేరుతో ఆ కేటుగా డు రూ.2950, రూ.3850, రూ.1100 మూడు సార్లు డబ్బు లు పంపించుకున్నాడు. మరల కాల్ చేసి మీ అకౌంట్‌లో రూ.5లక్షలు జమ అయ్యాయి కానీ అకౌంట్ హోల్డ్‌లో పడిందని చెప్పి రూ.5550 మరల పంపితే అకౌంట్ హోల్డ్ లోనుంచి తీసీవేస్తామని చెప్పడంతో నా అకౌంట్ రోజు ట్రాన్‌జక్షన్ నిర్వహిస్తా హోల్డ్‌లో ఎందుకు ఉంటుందని బావించి మోసం పోయామని గ్రహించింది. అప్రమత్తమై స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి రావడంతో 1930లో ఫిర్యాదు చేయాలని చెప్పి వారికి హెడ్ కానిస్టేబుల్ జడల రవి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు.



శివనామస్మరణతో మార్మోగిన తీర్థాల

» ప్రత్యేక పూజలు చేసిన కలెక్టర్ గౌతమ్ » మున్నేరులో నీరు లేక భక్తుల ఇబ్బందులు

ఖమ్మం రూరల్, మార్చి 8: ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వరాలయం శుక్రవారం శివనామస్మరణతో మార్మోగింది. మహాశివరాత్రి సందర్భంగా తీర్థాల ఆలయంలో గురువారం అర్ధరాత్రి తహసీల్దార్ రాంప్రసాద్ ప్రత్యేక పూజలు చేసి జాతరను ప్రారంభించారు. గత ఏడాదితో పోల్చుకుంటే భక్తుల రద్దీ కాస్త తక్కువగానే ఉంది. కొందరు భక్తులు రాత్రి నుంచి ఆలయంలో జాగారం చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మున్నేరు, ఆకేరు నదులలో నీళ్లు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు.

తీర్థాల చెక్‌డ్యాం వద్ద ఉన్న నీళ్లలోనే ఎక్కువ మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. జిల్లా కలెక్టర్ గౌతమ్ దంపతులు తీర్థాల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్సీ తాతా మధు, మేయర్ నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



క్యూలైన్‌లో భక్తులు

హర హర మహాదేవ...

శివనామ స్మరణతో మార్మోగిన శివాలయాలు ● భక్తిశ్రద్ధలతో శివపార్వతుల కల్యాణం



కోటి లింగాల జాతరకు హాజరైన భక్తులు

ఖమ్మం సాంస్కృతికం/కొత్తగూడెం సాంస్కృతికం, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో శివాలయాలు కిటకిటలాడాయి. భక్తులు పెద్ద సంఖ్యలో శివయ్యను దర్శించుకున్నారు. తెల్లవారు ఝామునుంచే భక్తులతో భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.

రూరల్ మండలం తీర్థాల, వైరా మండలం స్నానాల లక్ష్మీపురం, కూసుమంచి, చింతకాని మండలం నేరడ, పెనుబల్లి మండలం నీలాద్రి, బోనకల్, కల్లూరు, కోటిలింగాలలో శివరాత్రి జాతర, తిరునాళ్ల ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. నగరంలోని గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం, సుగ్గలవారి తోట శివాలయం, బ్రాహ్మణ బజార్‌లోని శివాలయాలతోపాటు అనేక చోట్ల గల శివాలయాలు రద్దీగా కనిపించాయి.

దర్శించుకున్న ప్రముఖులు

డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, నందిని దంపతులు తమ స్వగ్రామం వైరా మండలం స్నానాల లక్ష్మీపురం తోపాటు, చింతకాని మండలం నేరడ, మధిర శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలోని గుంటుమల్లేశ్వరస్వామి దేవాలయం, సత్తుపల్లి మండలం గుడిపాడు శివాలయాన్ని, పెనుబల్లి మండలం నీలాద్రీశ్వరాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు అభిషేకాల్లో పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ నేరెడ శివాలయం దర్శించిపూజలు చేశారు. కాగా, నేరెడ శివాలయం జాతర ఉత్సవాల్లో ప్రముఖ సినీ హీరో ప్రభాస్ చెల్లెలు, దివంగత హీరో కృష్ణంరాజు కుమార్తె సాయి ప్రసీద పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనయుడు సూర్యకు సాయి ప్రసీద మిత్రురాలు కావడంతో ఆమెను ఉత్సవాలకు ఆహ్వానించారు.



ఖమ్మం ఎస్సీ ఆఫీస్ రోడ్డు శివాలయంలో కల్యాణం



పడవలో ఆలయానికి వెళుతున్న దృశ్యం

స్నానాల లక్ష్మీపురంలో..

వైరా, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినమైన శుక్రవారం మండలంలోని స్నానాల లక్ష్మీపురం శివనామస్మరణతో మారుమోగింది. వేలాదిమంది భక్తులతో కిక్కిరిసిపోయింది. ఏడెనిమిది మండలాల నుంచి వేలాదిమంది భక్తులు తెల్లవారుజాము నుంచే స్నానాల లక్ష్మీపురానికి చేరుకొని వైరా నదిలో పుణ్యస్నానాలు చేసి గత సంవత్సరకాలంలో అశువులు బాసిన బంధుమిత్రులకు పిండప్రదానం చేశారు. ఆతర్వాత శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. ఇదే గ్రామానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, నందిని దంపతులు వారి కుమారుడు సూర్య విక్రమాదిత్యతో కలిసి ఆలయంలో పూజలు చేశారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పూజలు చేశారు.



భక్తులతో కిక్కిరిసిపోయిన స్నానాల లక్ష్మీపురం

మోతెగడ్డకు భారీగా భక్తులు..

బూర్గంపాడు, మార్చి 8: మండల పరిధిలోని మోతెగడ్డలో కొలువై ఉన్న వీరభద్రస్వామి దేవాలయంలో శుక్రవారం మహాశివ రాత్రి వేడుకలు కనుల పండుగగా నిర్వహించారు. నాటుపడవల ద్వారా గోదావరిని దాటి ద్వీపకల్పంలో ఉన్న ఆలయానికి భక్తులు చేరుకున్నారు. గోవిందమాంబా సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వారి ఆలయంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలంగాణ సరిహద్దు పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు మండలం పెదరావిగూడెం గ్రామంలోని గోదావరి ఒడ్డున ఉన్న శ్రీ పార్వతి సమేత కేదారేశ్వర స్వామివార్ల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రానికి భక్తులు బారులు తీరారు.

నీలాద్రీశ్వరుడి దర్శించిన భక్తులు

పెనుబల్లి, మార్చి 8: ప్రముఖ దైవక్షేత్రమైన నీలాద్రీశ్వర ఆలయంలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే అభిషేకాలు, పూజా కార్యక్రమాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నీలాద్రీశ్వరుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి తుమ్మలకు, ఎమ్మెల్యే రాగమయికి ఆలయ అర్చకులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. మహాశివరాత్రి సందర్భంగా నీలాద్రీశ్వరస్వామి ఆలయంలో తిరుపతికి చెందిన జ్యోతిష్యుడు బోధనపు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 2.25లక్షల నేపాల్ రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.



శివలింగానికి నమస్కరిస్తున్న భక్తులు

శివపార్వతుల కల్యాణం కమనీయం

కూసుమంచి, మార్చి 8: కూసుమంచి గణపేశ్వరాలయంలో శుక్రవారం అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన మండపంలో కల్యాణం జరిగింది. అంతకుముందు ఆలయ అర్చకులు, వేదపండితులుస్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి ఉత్సవమూర్తులను మేళతాళాల నడుమ అలంకరణ మండపంపైకి తీసుకవచ్చారు వివాహబంధం ప్రాముఖ్యతను, ఆదిదంపతులుగా నిలిచిన శివపార్వతుల గురించి అర్చకులు కళ్లకు కట్టినట్లు వివరించారు. ఈకార్యక్రమంలో ఆలయం ఈవో శ్రీకాంత్, శివమాలాధారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలుసాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.





గణపేశ్వరాలయంలో భక్తుల రద్దీ

కాగా మహాశివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామున ఒంటి గంట నుండే భక్తులు ఆలయానికి చేరుకుని శివుని దర్శించుకుని తరించారు. మహాదేవునికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. మహాశివునికి అర్ధరాత్రి రెండు గంటల సమయంలో లింగోద్భవ సమయాన స్వామివారికి మహాన్యాస ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.

శివుడి అనుగ్రహంతో రాష్ట్రం అభివృద్ధి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

వైరా/ సత్తుపల్లి, మార్చి 8: పరమశివుడి ఆశీస్సులతో తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆకాంక్షించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఖమ్మంజిల్లా వైరా మండలంలోని తమ స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించుకొని సతీమణి నందిని, కుమారుడు విక్రమాదిత్యతతో కలిసి శుక్రవారం పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం శివుడి అనుగ్రహంతో ఎంతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.

గుడిపాడు శివాలయంలో మంత్రి తుమ్మల పూజలు

మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి మునిసిపాలిటీలోని గుడిపాడులో ఇటీవల ప్రతిష్ఠించుకున్న శ్రీ దుర్గాపార్వతీ సహిత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, చేనేత శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెండు కన్నులు చాలునా..



హోమంలో పాల్గొన్న ఎస్పీ రోహిత్‌రాజ్



కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అన్నపురెడ్డిపల్లి, మార్చి 8: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున ఆలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. సంప్రదాయ రీతిలో శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవాలయం నుంచి పట్టువస్త్రాలు ముత్యాల తలంబ్రాలను అందించారు. ఆలయ ఆవరణలోని మండపంలో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దంపతులు, ఉత్సవకమిటీ సభ్యులు కూర్చుని క్రతువు నిర్వహించారు. కల్యాణ ఏర్పాట్లను దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ బెల్ సింగ్ పర్యవేక్షణలో ఆలయ మేనేజర్ వెంకటరమణ, సిబ్బంది అన్ని ఏర్పాటు చేశారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న భట్టి దంపతులు

గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలి

» ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

చింతకాని, మార్చి 8: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత భట్టి విక్రమార్క కుటుంబ సమేతంగా శ్రీభ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో 43వ రెండు రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. 42 సంవత్సరాలుగా నేతాజీ యువజన సంఘం కబడ్డీ పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సినీహీరో ప్రభాస్ సోదరి సాయి ప్రసీద పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి బందోబస్తును పర్యవేక్షించేందుకు వచ్చిన ఖమ్మం సీపీ సునీల్‌దత్ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కాంగ్రెస్ నాయకులు కన్నెబోయిన గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, దూసరి గోపి, మంకెన నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మల్లు నందినితో సినీహీరో ప్రభాస్ సోదరి సాయి ప్రసీద

'జాగారానికి' పోటెత్తిన భక్తులు..

» సింగరేణి గ్రౌడ్‌లో ఏర్పాట్లు » అలరించిన భక్తి గీతాలు

ఇల్లెందుటౌన్, మార్చి 8: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఇల్లెందు పట్టణంలోని సింగరేణి స్కూల్ గ్రౌండ్ శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాగారానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా వినూత్నంగా జాగారానాకి ఏర్పాట్లు చేయటంతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులను అలరించేందుకు జబర్దస్ సద్దాం టీం బృందం, డీ డ్యాన్స్ బృందం, వరంగల్, ఖమ్మానికి చెందిన మహిళలు, ఇల్లెందు శ్యాం డ్యాన్స్ బృందం పలు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. శివ భక్తులకు అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జాగారానికి వచ్చిన భక్తులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య దంపతులు, మునిసిపల్ చైర్మన్ దమ్మాల పాటి వెంకటేశరరావు భక్తులతో ఎంతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దొడ్డా డానియల్, మడుగు సాంబమూర్తి, సుదర్శన్‌కోరీ, బోళ్ల సూర్యం, చిల్లా శ్రీనివాస్, గందె సదానందం పాల్గొన్నారు. కార్యక్రమం అవాంచనీయ సంఘటనలు జరగకుండా ఇల్లెందు సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



కళాకారులతో ఎమ్మెల్యే కోరం కనకయ్య



రామాలయ అభివృద్ధిపై ఈవో సమీక్ష

భద్రాచలం, మార్చి 8: సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటన నేపథ్యంలో ఆలయాభివృద్ధి పనులపై ప్రత్యేక ప్రకటన చేసే అవకాశాలు ఉన్నాయని జోరుగా ప్రచారం సాగుతున్న క్రమంలో రామాలయ అభివృద్ధి పనులకు సంబంధించి వైదిక పరిపాలన కీలక అధికారులతో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి సమీక్ష నిర్వహించారు. భద్రాచలంలోని ఈవో కార్యాలయంలో శుక్రవారం ఆమె దేవస్థానానికి చెందిన స్థానాచార్యులు, ప్రధాన అర్చకులు, ఏఈవోలతో పాటు ఇతర వైదిక పరిపాలన అధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు. ఆలయం అభివృద్ధి పనుల్లో చేపట్టాల్సిన మార్పులు, చేర్పులు, ఇతరత్రా కీలక అంశాలపై నిశితంగా సమీక్ష సాగినట్లు తెలుస్తోంది. ఆదివారం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్ కూరాకుల జ్యోతి ముందుగానే భద్రాచలం చేరుకొని దేవస్థానం ఆధ్వర్యంలో చేపట్టే అభివృద్ధి పనుల ప్రణాళికపై మరోసారి దేవస్థానం అధికారులతో సమీక్ష చేయనున్నారు. సీఎం రేవంత్, మంత్రుల రాక నేపథ్యంలో దేవస్థానం వైదిక పరిపాలన అధికారులు పూర్తి అంతర్గతంగా సమావేశం నిర్వహించారు.

వైరా నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ధ్యేయం

ఏన్కూరు, మార్చి8: సీతారామ ప్రాజెక్టు ద్వారా వైరా రిజర్వాయర్‌తోపాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులను నింపి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ధ్యేయమని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అన్నారు. నియోజకవర్గానికి 5చెక్‌డ్యాంలకు రూ.8కోట్లు మంజూరయ్యాయన్నారు.దీనిలో భాగంగా మేడేపల్లి చెక్‌డ్యాంను శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెక్‌డ్యాంలను త్వరగా పూర్తి చేయాలని ఇరిగేషన అధికారులను కోరారు. ప్రభుత్వ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పక అమలు చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అరెం వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు లక్ష్మానాయక్, నాయకులు చందమామ నరసింహారావు పాల్గొన్నారు.

ఎంపీ వద్దిరాజుకు ఐజేయూ శుభాకాంక్షలు

ఖమ్మం కార్పొరేషన్, మార్చి 8: రాజ్యసభ సభ్యుడిగా రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికైన వద్దిరాజు రవిచంద్రను శుక్రవారం టీయూడబ్ల్యూజే(ఐజేయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.రాంనారాయణ, జిల్లా అధ్యక్షుడు వనం వెంకటేశర్లు, కార్యదర్శి ఏనుగు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వద్దిరాజును సన్మానిస్తున్న ఐజేయూ జిల్లా కమిటీ సభ్యులు

మహాశివరాత్రి రోజున అపశ్రుతి..

» సాంబారుగిన్నెలో పడి బాలుడికి గాయాలు

కూసుమంచి, మార్చి 8: మహాశివరాత్రి రోజున మండలంలోని జక్కేపల్లి బాలకోటేశ్వరస్వామి ఆలయంలో అపశ్రుతి చోటుచేసుకుంది. మహాదేవుడి దర్శనం అనంతరం ఆలయంలో అన్నదానం కార్యక్రమం జరుగుతుండగా పేరికశింగారం గ్రామానికి చెందిన అడపాల మనోహర్ తోపులాటకు గురయి సాంబారు గిన్నెలో పడిపోయాడు. దీంతో వీపుభాగం కాలిపోయి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే తల్లితండ్రులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుడి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు సమాచారం.

కూసుమంచి ఆలయ అభివృద్ధికి కృషి

» బీజేపీ పార్లమెంటు నాయకుడు తాండ్ర వినోద్‌రావు

కూసుమంచి/ ఖమ్మం బైపాస్‌రోడ్/ తల్లాడ, మార్చి 8: కేంద్ర పర్యాటక శాఖామంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి కూసుమంచి శివాలయం అభివృద్ధికి కృషిచేయనున్నట్లు ఖమ్మంజిల్లా బీజేపీ పార్లమెంటు నాయకులు తాండ్ర వినోద్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం కూసుమంచి శివాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలో అనేక చారిత్రక దేవాలయాలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటిపై మంత్రికి నివేదిక అందించనున్నాట్లు తెలిపారు. దేశప్రధాని మోదీ పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని పేర్కొన్నారు దేశంలో మునుపెన్నడూలేనివిధంగా మతసామరస్యం పరిఢవిల్లడానికి దోహదపడ్డాయని తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ మూడోసారి ప్రధానిని చేయడంకోసం ప్రజలు ఆశీర్వదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వినీత్‌గార్, నున్నా రవికుమార్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ వేడుక



బోనకల్, మార్చి8: బోనకల్‌లో శుక్రవారం తెలంగాణ విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి, గోవిందమాంబల కళ్యాణం నిర్వహించారు. వెంకటచారి, కళావతి దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ఆ సంఘ మండల కార్యాలయాన్ని జిల్లా గౌరవ అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ, వీరభద్రాచారి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘ నాయకులు పంతంగి శ్రీనివాసరావు, సతీష్, రావుట్ల లక్ష్మణాచారి, కృష్ణమాచారి, కళ్యాణీ, దుర్గ పాల్గొన్నారు.





విప్పలమడలో పాల్గొన్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, స్నానాల లక్ష్మీపురంలో భట్టిదంపతుల పూజలు, హాజరైన భక్తులు




కూసుమంచిలో కల్యాణం నిర్వహిస్తున్న దంపతులు, హాజరైన భక్తులు



నీలాద్రిలో రుద్రాభిషేకాలు నిర్వహిస్తున్న దృశ్యం



వైద్యనాథస్వామి ఆలయం వద్ద పులిహోర పంపిణీ



గుంటుమల్లేశ్వరస్వామి ఆలయంలో..

శంభో శంకర..

భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి
శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు
ఘనంగా శివకల్యాణం

సత్తుపల్లిరూరల్, మార్చి8: సత్తుపల్లిలోని గుడిపాడులోని శ్రీ దుర్గాపార్వతీ సహిత శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం, బుగ్గపాడులోని విశ్వధర్మక్షేత్రంలో, సదాశివునిపేటలోని కామాక్షి సమేత సదాశివలింగేశ్వరస్వామి, కాకర్లపల్లిలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం, బేతుపల్లిలోని శ్రీ భువనేశ్వరి సమేత గౌతమేశ్వర ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగారంలోని 15వ ప్రత్యేక బెటాలియనులో భక్తుల కోసం ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని కమాండెంట్ వీ.వెంకట్‌రాములు ప్రారంభించారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపో నుంచి నీలాద్రి పుణ్యక్షేత్రానికి ప్రతీ 10నిమిషాలకు ఒక బస్సును నడిపారు.

కల్లూరు: కల్లూరులోని శ్రీకాశ్మీరమహాదేవక్షేత్రం (అప్పయ్యస్వామి శివాలయం)లో పలు గ్రామాల నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని పూజలు చేశారు. చెన్నూరులోని గంగా శివపార్వతుల ఆలయంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఆలయల ప్రాంగణంలో జరిగిన మహాఅన్నదాన కార్యక్రమాల్లో రాగమయి, సండ్ర పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో కల్లూరు శివాలయం కమిటీ ఛైర్మన్ మాడిశెట్టి వెంకటేష్, ఆలయ ఈవో ఎస్‌వీడీ ప్రసాద్, రావూరి వెంకటేశ్వరరావు, నలజాల కిషోర్, మోటామర్రి వెంకటనాగేశ్వరరావు, నడిపల్లి, రాజేష్, గొర్రెపాటి రవీంద్ర,కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు, బిఆర్‌ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, లక్కినేని రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: మండలంలోని భీమేశ్వరస్వామి, ఉత్తరేశ్వరస్వామి, వైద్యనాథస్వామి, పైనంపల్లిలోని భ్రమరాంబికా మల్లకార్జునస్వామి, రాజేశ్వరపురంలోని శివాలయంలలో తాటిపాముల లక్ష్మీనర్సింహం,శివయ్య, పురాణం దివాకర్ పూజలు నిర్వహించారు. అత్యంత ప్రసిద్ధి చెందిన పురాతనమైన నేలకొండపల్లిలోని శ్రీవైద్యనాథస్వామి కాంతానాయకేశ్వరి ఆలయంలో కల్యాణం నిర్వహించారు.2007లో దేవాదాయశాఖ ఆలయాన్ని స్వాధీనం చేసుకుని కల్యాణం నిర్వహిస్తున్నది. ఆలయం పక్కనే ఉన్న వాగులో తగినంత నీరు లేకపోవటంతో భక్తులు ఇబ్బంది పడ్డారు. పంచాయతీ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసింది. భక్తులకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు పులిహోర, మినరల్ వాటర్‌ను పంపిణీ చేశారు.

తల్లాడ: గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, నూతనకల్‌లోని శ్రీనాగకమలేశ్వర ఆలయం, బాలపేటలోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయాల్లో వేడుకలు జరిగాయి. నూతనకల్‌లో ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. బాలపేట, నూతనకల్‌లో అన్నదానం చేశారు.

కొణిజర్ల: తనికెళ్ళ కొణిజర్ల, పల్లిపాడు గ్రామాల్లో శివపార్వతుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. పల్లిపాడు శంభులింగేశ్వస్వామి ఆలయంలో మహాన్నదానం ఏర్పాటు చేశారు.

తిరుమలాయపాలెం: మండలంలోని సుబ్లేడు, కాకరవాయి, బీరోలు, పాతర్లపాడు, పిండిప్రోలు తదితర గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం పిండిప్రోలు శివారు వీరకాశీపట్నంలో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.

బోనకల్: మండలంలోని రావినూతల, బోనకల్, ముష్టికుంట్ల గ్రామాల్లో శుక్రవారం మహా శివరాత్రి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు చేశారు.

ఖమ్మం సంక్షేమవిభాగం: ఖమ్మం వర్తకసంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన వేడుకల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు.

రఘునాథపాలెం, మార్చి 8: మండల వ్యాప్తంగా శివలయాల్లో శివ పార్వతుల కళ్యాణం నిర్వహించారు. వీ వెంకటాయపాలెం, చింతగుర్తి, జాన్‌బాద్‌తండా తదితర గ్రామాల్లో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.

కారేపల్లి: మూడురోజులపాటు జరిగే కోటిలింగాల జాతరకు భక్తులు శుక్రవారం పోటెత్తారు. వేలాదిమంది భక్తులు తరలి వచ్చారు. ఎమ్మెల్యే రాందాసునాయక్, ఇల్లెందు మున్సిపల్ ఛైర్‌పర్సన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లు పూజలు నిర్వహించారు.



కల్లూరు శివాలయంలో అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాగమయి




కూసుమంచిలో దయాకర్‌రెడ్డి, రాయల నాగేశ్వరరావు పూజలు



బుగ్గపాడు శివాలయంలో మహిళల ప్రత్యేక పూజలు



కొణిజర్లలో ధ్వజస్తంభం వద్ద పూజలు



చింతగుర్తి శివాలయానికి వస్త్రాలు తీసుకెళుతున్న ఆలయ కమిటీ సభ్యులు



తల్లాడ శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు



నిజాంపేటలో కల్యాణంలో పాల్గొన్న దంపతులు



కల్లూరుమాజీ ఎమ్మెల్యే సండ్ర

నేడు నేలకొండపల్లిలో విద్యుత్ కోత

నేలకొండపల్లి, మార్చి8: మండల పరిధిలోని కొత్తకొత్తూరు విద్యుత్ సబ్-స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈఈ రామారావుఒక ప్రకటనలో తెలిపారు. కావున సబ్-స్టేషన్ పరిధిలోని నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, పాతకొత్తూరు, తిరుమలాపురంతండా, పైనంపల్లి, బోదులబండ, అనంతనగర్, కోరుట్లగూడెం గ్రామాల్లో శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయ బడుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ ఆపరేషన్స్ రామారావు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

మజీద్ కమిటీ ఎన్నిక



నేలకొండపల్లి, మార్చి8: నేలకొండపల్లి మజీద్ కమిటీకి నూతన అధ్యక్షుడిగా యండి.మహబూబ్‌ఆలీ ఎన్నికయ్యారు. శుక్రవారం మజీద్‌లో జరిగిన ముస్లిం మైనార్టీల సమావేశంలో ఈఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షుడిగా షేక్.సుభాన్, కోశాధికారిగా పాషాఖాన్, కమిటీ సభ్యులుగా షాకీర్ అహ్మద్, తానీషా, ఖాజాను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి8: తెలంగాణ సంక్షేమ వసతిగృహ సంక్షేమాధికారుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడు దివంగత తుమ్మలపల్లి రామారావు 4వ సంస్మరణ సభను కుటుంబ సభ్యులు శుక్రవారం ఖమ్మంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదోతరగతి పరీక్షాలకు హాజరు కానున్న 300 మంది ఎస్సీ వసతిగృహంలోని విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కొటపాడు రుక్మారావు మాట్లాడుతూ తుమ్మలపల్లి రామారావు 25ఏళ్ల పాటు టీఎన్జీవో, సంక్షేమాధికారుల సంఘం అధ్యక్షుడిగా ఉంటూ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి కృషి చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి విజయలక్ష్మీ, భవ్య, కస్తాల రఘు, చరిత, కస్తాల వసంత, శైలజ, జగదాంబ, అలేఖ్య, కార్తీక్, అఖిల్, ఆకాశ్, సాయి, తిరుపతిరావు, మాన్సింగ్, నరేశ్ పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న తుమ్మలపల్లి రామారావు కుటుంబ సభ్యులు

ఘనంగా మహిళా దినోత్సవం

సత్తుపల్లిరూరల్, మార్చి8: జిల్లావ్యాప్తంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా రంగాల్లో ఉన్నత స్థానాల్లో నిలిచిన మహిళలను సన్మానించారు. మహిళా సాధికారతను వివరించారు. ఇటీవల రెండు, మూడు ఉద్యోగాలు సాధించిన వారిని సన్మానించారు. సత్తుపల్లి మండలంలోని కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చలసాని హరికృష్ణ,సైకాలజిస్ట్, మోటివేషను, కమ్యూనికేషను, సాఫ్ట్‌స్కిల్స్ ట్రైనర్ పరిమి విజయలక్ష్మీ మాట్లాడారు. విద్యార్థినులు నేటిఆధునిక సమాజంలో ధోరణులు, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, రాజకీయ, న్యాయ, శాస్త్ర సాంకేతిక, టెక్నాలజీ, క్రీడా రంగంలో పోటీ పడుతూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. ఒక లక్ష్యంతో చదువుతూ టెక్నికల్ నాలెడ్జీ, సాఫ్ట్‌స్కిల్స్‌ను అభివృద్ధి పరచుకుని ఎంచుకున్న రంగంలో రాణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ డీను డాక్టర్ జాకీర్‌హుస్సేను, మిస్ట్ ఉమెను ఎమ్‌పవర్‌మెంట్ ఛైర్మను టీ.పద్మజ్యోతి, కమిటీ సభ్యులు, మహిళా అధ్యాపకులు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు. గంగారంలోని 15వ ప్రత్యేక పోలీస్ పటాలంలో కమాండెంట్ వీ. వెంకట్‌రాములు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల నాలుగు ఉద్యోగాలు సాధించిన సోయం విజయను సన్మానించారు. సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయిని కౌన్సిలర్లు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

వైరా: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని వైరా ఎంపీడీవో సరస్వతీ ఆకాంక్షించారు. మండలంలోని విప్పలమడకలో శుక్రవారం ఒక ప్రముఖ విత్తన కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపీడీవో సరస్వతీ మహిళా దినోత్సవంలో పాల్గొని స్థానిక మహిళా రైతులను శాలువాలతో సన్మానించారు.

కామేపల్లి: కామేపల్లి మండల కేంద్రంలో అవధూతేంద్ర భక్తమండలి కన్వీనర్ గొట్టుపర్తి శివాజీ ఆధ్వర్యంలో 40 మంది మహిళను సత్కరించారు. ఈ కార్యక్రమంలో భక్త మండలి సభ్యులు ఆంగోత్ రమేస్, హనుమంత్ సాయి క్రిష్ణ, మాజీ సర్పంచ్ జర్పల రామారావు పాల్గొన్నారు.

మహిళలందరికి ఉచిత న్యాయ సహాయం

ఖమ్మంలీగల్: బీద, ధనిక పేద వంటి భేదాలు లేకుండా మహిళలందరకికి ఉచిత న్యాయ సహాయం అందించడం భారత రాజ్యాంగ ఔన్నత్యమని జిల్లా న్యాయ సేవాధికారసంస్థ కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మహమ్మద్ అబ్దుల్ జావీద్‌పాషా అన్నారు. శుక్రవారం న్యాయాధికారి జిల్లా జైలులోని మహిళా విచారణ ఖైదీలకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. చట్టాలను వివరించారు.



న్యూవిజన్‌లో వేడుకల్లో పాల్గొన్న మహిళ ఉపాధ్యాయులు



ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించిన విజయను అభినందిస్తున్న కమాండెంట్ వెంకటరాములు



ఎర్రుపాలెంలో మహిళా నాయకుల సన్మానం



మాట్లాడుతున్న అంకాలజిస్టు మురళి



మహిళా రైతును సన్మానిస్తున్న ఎంపీడీవో

న్యూవిజన్‌లో పాఠశాలలో..

ఖమ్మంఖానాపురంహవేలి: నగరంలోని న్యూవిజన్ పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. విద్యాసంస్థల డైరెక్టర్ సీహెచ్ జీకే కార్తీక్ మాట్లాడుతూ సృష్టికి మూలమైన స్త్రీచేసే త్యాగాలు అమూల్యమైనవన్నారు. అమ్మ సేవలను వెలకట్టలేనివన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

వేంసూరు: మర్లపాడులో సీపీఐ మండల కార్యదర్శి భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కేక్‌ను మహిళలు కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

మహిళ సాధికారిత సాధించాలి

ఖమ్మం సంక్షేమవిభాగం: సమాజంలో మహిళల హక్కులు, గౌరవం కాపాడినప్పుడే మహిళ సాధికారిత ఏర్పాడుతుందని ప్రముఖ అంకాలజిస్టు వైద్యులు దాములూరి మురళి పేర్కొన్నారు. మంచికంటి భవన్‌లో టీపీఆర్‌పీఎ, టీపీఎస్‌కే, బీవీకే, జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో పీ ఝాన్సి, రాములమ్మ, స్వరూపరాణి, భారతి, మల్లిఖార్జునరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, గోపీచంద్, గణపతి పాల్గొన్నారు.

అంబేద్కర్‌నగర్, శాంతినగర్‌లో

కల్లూరు:కల్లూరులోని అంబేద్కర్‌నగర్, శాంతినగర్‌లలో శుక్రవారం రాత్రి వేడుక జరుపుకున్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ఆధ్వర్యంలో పలువురు మహిళ ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులను సన్మానించారు. మహిళ హ్యూమన్‌రైట్స్ అధ్యక్షురాలు ఎనుముల రుక్మిణీ, ఎంపీటీసీ దామల జ్యోతి, పలువురుని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ దామాల రాజు, మాజీ జడ్పీటీసీలు కాశీమళ్ల పురుషోత్తం, ఎస్‌కే యాఖుబ్‌అలీ, దామాల సురేష్, ఉబ్బన దేవదాసు, ఉబ్బన శ్రీను, కోట వెంకటేశ్వరరావు(కేవి) బైర్ల కాంతరావు, కరుణాకర్, కనకపుడి జయరాజు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం

ఎర్రుపాలెం: మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మహిళా ప్రజా ప్రతినిధులను, మహిళా నాయకురాళ్లను సన్మానించారు. మండల పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ శిరీష, మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత వీవీ పాలెం

ఖమ్మం స్పోర్ట్స్, మార్చి 8: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నగరంలోని మున్సిపల్ ఫుట్‌బాల్ క్రీడాప్రాంగణంలో బాలికలకు పోటీలు నిర్వహించారు. ఈ టోర్నీలో విజేతగా వీవీ.పాలెం జట్టు నిలిచింది. టోర్నీలో మొత్తం ఐదు ప్రభుత్వ పాఠశాలల జట్లు పాల్గొన్నాయి. గురువారం నిర్వహించిన ఫైనల్ పోటీలో మేడేపల్లి జట్టుపై 3-1 స్కోరు తేడాతో విజయం సాధించి టైటిల్‌ను నిలబెట్టుకుంది. కోయచెలక జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రతిభ చూపిన క్రీడాకారిణులను కార్పోరేటర్ ప్రశాంతలక్ష్మి, జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సెల్యూకస్, ఆదర్శ్‌కుమార్ తదితరులు అభినందించారు.



ప్రథమ బహుమతి సాధించిన వీవీ పాలెం జట్టు

మంత్రి తుమ్మలను కలిసిన వ్యవసాయ, ఉద్యాన అధికారులు



అధికారులకు సూచనలు చేస్తున్న మంత్రి

ఖమ్మం వ్యవసాయం, మార్చి 8: వ్యవసాయ, ఉద్యాన, మార్కెటిగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును శుక్రవారం ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యాన అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎం. విజయనిర్మల, ఏడీఏ ఎ శ్రీనివాసరావు, ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ, ఖమ్మం అర్బన్ వ్యవసాయ అధికారి బి. కిషోర్ బాబు మంత్రిని కలిశారు. పామాయిల్‌సాగుకు రైతులను ప్రోత్సహించాలని వారికి సూచించారు. ఖమ్మం అర్బన్ సాగు, గ్రామాల వివరాలు వ్యవసాయ అధికారిని అడిగా, పామాయిల్ సాగు విస్తీర్ణం పెంచాలని మంత్రి తుమ్మల నిర్దేశించారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కామేపల్లి, మార్చి 8: కామేపల్లి మండలం కెప్టెన్ బంజరలో యూత్ ఆధ్వర్యంలో నాలుగు మండలాల క్రికెట్ టోర్నమెంట్‌ను కామేపల్లి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవండ్ల రామక్రిష్ణ, మాజీ సర్పంచులు గుంపెనపల్లి అనంతరాములు, కుర్సం సత్యానారాయణ శుక్రవారం ప్రారంభించారు. ఈ టోర్నమెంట్‌లో మొదటి బహుమతి దాత ఆరెం రవి రూ.20వేలు, ద్వితీయ బహుమతి దాత దేవండ్ల రామక్రిష్ణ రూ.10వేలు, తృతియ బహుమతి దాత కుర్సం సత్యానారయణ రూ.6వేలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాలోత్ రామారావు జర్సీలను అందజేశారు. ఈకార్యక్రమంలో నిర్వహకులు వెంకట్, ఫణి, వెంకీ, రాంబాబు, లక్ష్మణ్, కిట్టు ఉన్నారు.

మోదీ పాలనలో మహిళలకు రక్షణ లేదు

ఏన్కూరు, మార్చి8: మోదీ పాలనలో మహిళలకు రక్షణ కరువైందని ప్రగతిశీల మహిళ సంఘం మండల కార్యదర్శి మద్దెల కౌసల్య అన్నారు. శుక్రవారం రాజలింగాల గ్రామంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మాట్లాడారు. మోదీ పదేళ్ల కాలంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. మణిపూర్‌లో గిరిజనన మహిళలను నగ్నంగా ఊరేగింపు చేసి హతమార్చిన సంఘటనలు ఎన్నో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళ సంఘం నాయకులు నాగేంద్రలక్ష్మి, అలివేలు, నాగమణి, ఉపేంద్ర, నారమ్మ తదితరులు పాల్గొన్నారు.